ప్రజా సాహితి మాసపత్రిక (నవంబర్, 1977)

# వ్యాపారాజు

**త**ప్పుడు కొలతలతో తక్కువ తూకాలతో సరకులమ్మి పెట్టెలు నింపుకోవటం -

అత్యవసర వస్తువులు దాచేసి ప్రజలు హాహాకారాలు చేస్తుండగా తప్పనిసరిగా కొనుక్కునే స్థితికి తీసుకువచ్చి అప్పుడధిక ధరలకి సరకులమ్మి సంచులు నింపుకోవటం -

ప్రతి వస్తువులోనూ సిసలైన కల్తీ కలిపి సర్వకాల సర్వావస్థలలోను ప్రజలకందించి అటు పేరు ఇటు పైస పోగేసుకోవటం -

అటువంటి పద్ధతులన్నీ పాటించే వ్యాపారోత్తమోత్తముండు గవర్రాజు. ఎన్నెన్ని వ్యాపారాలు చేస్తున్నాడు - ఎలా ఎలా కల్తీ చేస్తున్నాడు - ఎంతెంత లాభాలు పోగేసుకుంటున్నాడు - అన్న వివరాలు ఇక్కడ అనవసరం. అచిరకాలంలోనే ఉత్తమ వణిక్ప్రముఖుల జాబితాలో కెక్కి వేనోళ్ళ ప్రభుత్వం చేత కొనియాడబడ్డాడన్నదే ఇక్కడ ముఖ్యం.

ప్రభుత్వం అంటే ఎవరు? పార్టీలు - ఎన్నికలు - ఎత్తుగడలు - నోట్లు... ఓట్లు చివర వో దొరతనం.... ప్రజా ప్రభుత్వమనే రాజరికం! ఇదంతా అందర్కీ తెలిసిన కథే కనుక మనం ఇక్కడ ముచ్చటించుకోనక్కర్లేదు. ఆ ప్రభుత్వ పార్టీకి చందాల్చిన వణిక్సామ్రాట్ మన గవర్రాజు అని గుర్తుంచుకుంటే చాలు!

అటువంటి గవర్రాజు నూనెల్లోను, వనస్పతిలోను చక్క చక్కటి కల్తీ పదార్థాలేవో కలిపి అమ్ముతున్నాడు. అసలు గవర్రాజు కనిపెట్టిన ఫార్ములాతో కల్తీ చేసిన తర్వాతనే నూనెకంతటి కమ్మని వాసన వచ్చిందని ప్రజలకి తెల్సివచ్చిందంటే అతిశయోక్తి కాదు. అతని ప్రయోగం

కల్తీరంగంలో విప్లవాన్ని తీసుకువచ్చింది.

తన పేటలో ఉన్న సుబ్బయ్య అనే సన్నకారు షావుకారుని పిలిచాడు గవర్రాజు. సంగతి చెప్పాడు. మార్కెట్టు ధరకంటే తగ్గించి యిచ్చి నూనె పట్టుకు వెళ్ళమన్నాడు. వ్యాపార రహస్యం బ్రతుకు తెరువు చెప్పి పైకి రమ్మని ఆశీర్వదించాడు.

సుబ్బయ్యకి స్వంత తెలివి తేటలు లేకపోయినా గవర్రాజు అందించింది మాత్రం అమాంతంగా దొరక పుచ్చుకున్నాడు. బజ్జీలు మొదలు - బాదుషా వరకు రకరకాల పిండి వంటలు చేసి కన్నదిరే రంగుల్లో తన దుకాణం రూపాన్నే మార్చేశాడు.

సుబ్బయ్య మిఠాయి దుకాణం పిల్లల బడికి చాలా దగ్గర. గతంలో ఆ కొట్టు ప్రక్కనే సూరయ్య కొట్టు వుండేది. సుబ్బయ్యకి గవర్రాజు వరం ప్రసాదించికముందు సూరయ్య మిఠాయిలకి మంచి గిరాకీ వుండేది. కానీ సుబ్బయ్య కల్తీ మిఠాయిలకిప్పుడు కొంచెం ధర తక్కువ మూలంగా పేరొచ్చింది. మరి కొన్నాళ్ళకే సూరయ్య తన కొట్టు మూసేసుకోవలసి వచ్చిందని వేరే చెప్పనక్కర్లేదు. ఇప్పుడు సుబ్బయ్యది ఇష్టా రాజ్యం.

పేద పిల్లలకి ఎప్పుడోకాని కొనుక్కునే స్తోమతు లేదు. అసలు పేద పిల్లలు బడికి వస్తారు గనుకనా? కనక సుబ్బయ్య మిఠాయిల విషం వాళ్ళనంతగా బాధించేది కాదు. అసలు తిండే లేక రకరకాల జబ్బులతో డాక్టర్ల దగ్గరికి వెళ్ళవల్సి వచ్చేదేమోకాని... వాళ్ళ జబ్బులకి సుబ్బయ్యని బాధ్యుడనటం మనకు సబబు కాదు.

మరి మధ్య తరగతి వాళ్ళ పిల్లలు ఆడపా తడపా డబ్బులు తెచ్చుకునేవారు. వాళ్ళు తినే మిఠాయి వాళ్ళకి "స్లోపాయిజన్" అందిస్తోంది. స్కూలుకి వస్తున్నారు. వస్తున్నప్పుడు మిఠాయిలు తింటున్నారు. తింటున్నప్పుడు రోగాలు వస్తున్నాయి. రోగాలు వచ్చినప్పుడు మంచాలు పడ్తున్నారు. జబ్బులు తగ్గాక గాని స్కూళ్ళకు రాలేకపోతున్నారు.

ఇక వున్నవాళ్ళ పిల్లలకి డబ్బులకి కొదువ లేదు. సుబ్బయ్య మిఠాయిలకీ, వాటిలోని విషానికీ కొదువలేదు. ఆపైన పెద్ద జబ్బులు - ఆ జబ్బులకి పెద్ద పెద్ద డాక్టర్లు, ఖరీదైన మందులూ అవన్నీ పెద్ద పెద్ద ఎత్తున వుండనే వున్నాయి.

కృష్ణుడు తల్లిదండ్రుల నోముల పంట. యావదాస్తికి ఏకైక వారసుడు. వాడిమీదనే కన్న వాళ్ళ ప్రాణాలన్నీ కాపు కాచి వున్నాయి. లోటన్నది ఆ చిన్నారి మనసులో చోటు చేసుకోరాదని మరో నాల్గు చేతులరువు తెచ్చుకొని మరీ పిల్లవాడి చేతుల్లో నోట్లు కూరి పెడుతూ వచ్చారు.

ఆ చిన్నవాడు ఎన్నో హాట్లు, స్వీట్లు కొనేవాడు. ఎన్ని తిన్నా ఇంకా మిగిలిపోయేవి. ఎన్నని తినగలడు? ప్రతిఫలం ఆశించకుండా తోటివాళ్ళకి నోటి ముందున్నది పెట్టాలనిపించే పిన్న వయస్సది. ఇంకా 'లో' క్లాసు వాళ్ళని 'హై' క్లాసు వాళ్ళు చీదరించుకోవాలని తెలియని వయస్సది.

రాముడనే కుర్రాడితో కృష్ణుడికి మంచి స్నేహం అయింది. కృష్ణుడు తన స్నేహంతోపాటు మిఠాయిని కూడా రాముడికి పంచి పెట్టాడు.... పాపం, తనకు తెలియకుండా మిఠాయిల్లోని

విషాలనీ అలాగే పంచి పెట్టేవాడు.

ఉన్నట్టుండి ఓ రోజున కృష్ణుడికి విపరీతంగా వాంతులు వెళ్ళాయి. శ్రీమంతుల బిడ్డ! చీదితేనే డాక్టర్లు రెక్కలు కట్టుకుని వచ్చివాల్తారే! మరిక వాంతులయితే రారూ? వచ్చారు - హడావిడిగా అరడజనుమంది వచ్చారు. రకరకాల పరీక్షలు చేశారు. 'కల్తీ కబురు' చల్లగా చెప్పారు. చెప్పిన కబురులో మాత్రం కల్తీ లేకుండా చెప్పారు.

కృష్ణుడు తండ్రి గవర్రాజు గుండెల్లో రాయి పడింది. తను అందరికి పెట్టే విషం... తన కొడుక్కు ఎవరు ఎలా పెట్టారో అతనికి అంతు పట్టలేదు. 'ఏ మాత్రం ఆలస్యమయినా మరిక పిల్లాడు తనకి దక్కేవాడు కాదు' - అన్న డాక్టర్ల మాటలు అతన్ని నిలువెల్లా వణికించాయి.

కొడుక్కి ఇంట్లో 'విషం' తినేందుకు ఆస్కారం లేదు... తన జాగ్రత్తలో తానున్నాడు. ఇక ఏం జరిగినా బయటే జరగాలి. కొడుకు ఎక్కడెక్కడ ఏం తిన్నాడో ఆరాలు తీసాడు. సుబ్బయ్యకి కబురంపి నిర్ధారణ చేసుకున్నాడు. తన కొడుకు చదువుకొనే స్కూలు పక్కనే సుబ్బయ్య కొట్టు వుందన్న చిన్న విషయం మర్చిపోయినందుకు తన్ను తాను తిట్టుకున్నాడు. ఇంతకాలం తన కొడుకిలా కొనుక్కుంటున్న సంగతి చెప్పనందుకు సుబ్బయ్యని తిట్టాడు!

డబ్బుకి కొదవలేదుగా! వందలకి వందలు వెదజల్లాడు. డాక్టర్లని రాత్రింబవళ్ళు నోట్ల కట్టలతో ఇంట్లో కట్టిపడేసాడు. ఎక్కడెక్కడి మందులూ తెప్పించాడు. కల్తీలేని సిసలయిన మందులు వాడించాడు. తనకొడుకు నెలాగయితే దక్కించుకున్నాడు!

ఈలోగా ఒక పక్షం గడిచింది.

కాని, ఆ పక్షంలోనే మరో విధంగా కథ నడిచింది.

కృష్ణుడికి వాంతులు వెళ్ళిన రెండ్రోజుల్లో రాముడికీ వాంతులు మొదలయ్యాయి. అతన్ని కన్నవాళ్ళు శ్రీమంతులు కారు.... అందుకని తామే డాక్టర్ల దగ్గరికి పరిగెత్తుకు వెళ్ళారు. కాంపౌండర్ డాక్టరు మందిచ్చాడు. వాంతులు తగ్గాయి. కాని జ్వరమొచ్చింది. ఎంతకీ జ్వరం తగ్గకపోతే పెద్ద డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళమన్నాడు. అది విషజ్వరమని చెప్పాడు ఆ డాక్టరు. వీళ్ళు పట్టుకు వెళ్ళిన డబ్బు ఆయన ఫీజుకి చాల్లేదు. ఇంక మందులేం కొనగలరు! ముందు పిల్లాడు బ్రతికి బయటపడితే తర్వాత వాళ్ళ ఫీజు ఇస్తారని గ్యారంటీ వుంటే డాక్టరు (పాపం) పెట్టుబడి పెట్టేవాడేమో! ఆయనకలాంటి నమ్మకాలు రానూ లేదు -పిల్లవాడి తల్లిదండ్రులు చెప్పినా ఆయన నమ్మకం పెట్టుకొనేంత 'సాహసం' చేయనూ లేదు. ఆ తరగతి బ్రతుకులకే గతి పడుతుందో ఆ గతికి స్వయంగా తీసుకువెళ్ళి మరీ వదిలేశాడు!

ఆ పిల్లవాడికి జరక్కూడని ఘోరం జరిగిపోతూంటే చూస్తూ ఊర్కున్నాడు! 'నేను చెయ్యగల్గింది ఇంతే!' అని కూడా చెప్పేశాడు - ఏమాత్రం సందేహించకుండా!

ఇలాగే ఆ స్కూల్లో చాలామంది పిల్లలకి జబ్బులొచ్చాయి. ఎవరో బుర్రలు ఉపయోగించారు. ఆరాలు తీసారు. కూపీ లాగారు. నిజం బయటపడింది. దాంతో సుబ్బయ్య మీద అధికారులకి రిపోర్టులిచ్చారు. అధికారులు తాపీగా వచ్చారు. సుబ్బయ్య మిఠాయిల్ని

రసాయన పరీక్షలకి పంపారు! అలాంటి తంతంతా యథావిధిగా జరగాలి. వారది జరిపించారు.

సుబ్బయ్య అమాంతంగా వచ్చి గవర్రాజు కాళ్ళమీద పడిపోయాడు. 'నా కన్యాయం జరిగిపోయింది బాబో! తమరేం చెపితే అదే చేసాను' - అని గోల పెట్టాడు.

'అదంతా నేను చూస్కుంటాను. మా అబ్బాయి నీకొట్టు కింకెప్పుడయినా వస్తే ఆ మిఠాయిలు మాత్రం పెట్టకు' అన్నాడు గవర్రాజు.

చిత్తమన్నాడు సుబ్బయ్య. 'కావాలంటే, స్పెషల్ నెయ్యితో తయారు చేసి అబ్బాయిగారికి పెడతాను. మరి నా తల కాయండి' అన్నాడు.

అతని తలకాసాడు గవర్రాజు. సుబ్బయ్యకి 'రెండు వందలు' జరిమానా పడింది. అధికారులకి ఆనవాయితీగా నజరానాలు ముట్టాయి. ధర్మం నిలువవల్సిన చోట (కోర్టులో) న్యాయానికి మరోసారి శిలువ వేశారు.

దరిమిలాను గవర్రాజు కల్తీ వ్యాపారానికేం ఢోకా లేకపోయింది. సుబ్బయ్య మిఠాయి వ్యాపారమూ నిక్షేపంలా సాగిపోయింది. సుబ్బయ్యచేత అధికారులు కొట్టు మూయించేసారని కొందరు సంతృప్తి పడిపోయారే కాని... మళ్ళీ మంచి సెంటర్‌లోకి కొట్టు మార్చాడన్న విషయం గుర్తుపెట్టుకోలేదు. ఈ మాట మిఠాయిలు తినటానికక్కడ అమాయకులు, అర్భకులు లేరు. కొత్త కష్టమర్సు - ఉద్యోగస్తులు, పొరుగూరి వాళ్ళు విషపదార్థాల్ని ఎలాగో అలా అరాయించుకో గలిగినవాళ్ళు.....

గవర్రాజు సలహా ప్రకారం సుబ్బయ్య వేషం మార్చాడు. పంచెలు మానేసి పేంట్లు తొడిగాడు. హెయిర్ స్టయిల్ మార్చాడు. వీడే పాత నేరస్తుని జ్ఞాపకముంచుకొనే శక్తి జనానికుండదని అతని ధీమా! అమాయకులు ఆ స్వీట్లు తింటున్నారు. రోగాలు తెచ్చుకుంటున్నారు. డాక్టర్ల దగ్గరికి వెడుతున్నారు. డబ్బున్నవాళ్ళు ఉంటున్నారు. లేనివాళ్ళు తీసుకు, తీసుకు ఛస్తున్నారు.

సుబ్బయ్యకి పోయిందేమీ లేదు. గవర్రాజుకీ పోయిందేమీ లేదు... వాళ్ళ వ్యాపారాల్ని అనుక్షణం కనిపెట్టి 'రక్షించే' అధికారులకి 'వచ్చిందే' కాని పోయింది అసలేమీ లేదు.

కొడుకుని విదేశాలకి పంపించి గొప్ప ఇంజనీర్ని చేసి ఆ తర్వాత బ్రహ్మాండమైన వ్యాపార సంస్థల్ని నెలకొల్పాలనుకున్నాడు గవర్రాజు. అతని ఆశలన్నీ నెరవేర్చటానికి కృష్ణుడు మళ్ళీ బడికి వెళ్ళి చదువుకుంటున్నాడు.

కాని...

కనీసం ఒక గుమాస్తా ఉద్యోగానికయినా పనికి వచ్చే చదువు నా కొడుకు చదవగలిగితే అంతే చాలనుకున్నాడు రాముడి తండ్రి. ఆ మాత్రం ఆశల్ని నెరవేర్చలేని స్థితిలో కాళ్ళుపడిపోయి శాశ్వతంగా అవిటివాడయి పోయాడు రాముడు!

●